సాక్షి ప్రకాశం
సోమవారం । 5 । ఆగస్టు । 2024



రిపీట్ 2014-19

జిల్లాలో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఖరీఫ్ పంటలు వాడుముఖం పట్టాయి. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. - 8లో..



ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
37/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఒంగోలు బ్లడ్‌లోనే రాడీయిజం ఉంది

● ఎస్పీ దామోదర్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: ఒంగోలు బ్లడ్‌లోనే రౌడీయిజం ఉన్నట్లుందని, దాన్ని అణచివేస్తామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. నగరంలోని ఎన్జీఓ కాలనీలో ఆదివారం కిరాణా దుకాణానికి వెళ్లిన ఒక పదేళ్ల మైనర్ బాలిక పట్ల ఎడ్లూరి జయదీప్, ఎర్రగుంట్ల అనూప్ అనే ఇద్దరు యువకులు వెంటపడి వేధించడమే కాకుండా అసభ్యంగా ప్రవర్తించారు. ఈ విషయాన్ని ఆ బాలిక తండ్రి ఎస్పీకి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత బాలికతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఒంగోలులో రౌడీయిజాన్ని అణచివేస్తామని చెప్పారు. ప్రజలు ముఖ్యంగా మహిళలు, పిల్లలు ప్రశాంతంగా జీవించే వాతావరణం కల్పిస్తామన్నారు. గంజాయి బ్యాచ్ సంగతిని తేలుస్తామని, అన్నిటిమీద తగిన చర్యలుంటాయని స్పష్టం చేశారు. బాలిక వెంట పడి వేధించడమే కాకుండా బైకు మీద తీసుకెళ్లేందుకు ఒత్తిడి చేశారని చెప్పారు. బాలికను కేవలం భయపెట్టేందుకు వచ్చారా లేక కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం యువకులిద్దరినీ అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. విచారణ తరువాత రౌడీ షీట్ కూడా ఓపెన్ చేస్తామని వెల్లడించారు. ఎస్పీ వెంట ఒంగోలు డీఎస్పీ కిశోర్ కుమార్, ఎస్బీ సిఐ రాఘవేంద్ర, సిబ్బంది ఉన్నారు.

ఆడపిల్లల రక్షణ గాలిలో దీపమైంది. వీధిలో అడుగుపెడితే చాలు వెంటపడి వేధించే మృగాళ్లు అడుగడుగునా తారసపడుతున్నారు. ఒంటరిగా బయటకు వెళితే మళ్లీ క్షేమంగా ఇంటికి చేరతారన్న నమ్మకం లేకుండాపోతోంది. మాయమాటలతో వంచించేవారు కొందరు.. ఆకతాయితనంతో మానసిక వ్యథకు గురిచేసేవారు మరికొందరు.. అదేమిటని ప్రశ్నించిన వారిపైనా దాడులకు తెగబడుతున్నారు. మహిళలనే కాదు బాలికలనూ వేధింపులకు గురిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అదుపు తప్పిన శాంతిభద్రతలు మహిళల రక్షణను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. జిల్లాలో జరుగుతున్న వరుస ఘటనలు దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

● క్షణక్షణం.. భయం భయం

అడుగుకో మృగాడు



- జిల్లాలో బాలికలకు రక్షణ కరువు
- ముగ్గురు మృగాళ్ల చేతిలో దగా పడిన గిరిజన యువతి
- కేజీబీవీ మరుగుదొడ్లోనే మృతశిశువుకు జననం
- కూతురితో మాట్లాడవద్దన్నందుకు తండ్రిపై ఓ యువకుడి దాడి
- కిరాణా దుకాణం వరకు వెళ్లిన బాలిక వెంట పడి గోల
- వరుస ఘటనలతో బెంబేలెత్తుతున్న తల్లిదండ్రులు

ఒంగోలు టౌన్: ఇటీవల కాలంలో జిల్లాలో మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. ప్రధానంగా బాలికలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. వారం రోజులుగా ఒకదాని వెంట మరొకటిగా జరుగుతున్న ఘటనలతో ఆడపిల్లల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. తమ బిడ్డలను చదువుకునేందుకు పాఠశాలలకు పంపాలన్నా బెదిరిపోతున్నారు. పాఠశాల సంగతి తరువాత కనీసం ఏదైనా పనిమీద బజారుకు పంపించాలంటే కూడా వెనకాడే దుస్థితి నెలకొంది. దాంతో ఆడపిల్లలను ఒంటరిగా పంపించేందుకు ధైర్యం చేయలేకపోతున్నారు. ఒంగోలు నగరంలో ఎటు చూసినా మద్యం తాగి తిరుగుతున్న అల్లరి మూకలు పేట్రేగి పోతున్నాయి. నిత్యం కళాశాలలు, హాస్టళ్ల వద్ద సంచరిస్తూ విద్యార్థినులను ఆటపట్టిస్తున్నారు. ఏ మాత్రం అవకాశం దొరికినా వేధింపులకు గురిచేస్తున్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్పీ మహిళా పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసేందుకు వెళ్లిన సమయంలో ఒక ఫిర్యాది నిలబడి ఉండడం గమనించి వారితో మాట్లాడారు. పదేళ్ల వయసున్న తన కూతురిని వంటవారిపాలెంకు చెందిన మిట్ట అనిల్ యువకుడు వేధిస్తున్నాడని ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఇలాంటి బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కొందరు ధైర్యంగా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నారు. కానీ పోలీసులకు ఫిర్యాదు చేయని వారి సంఖ్య రెట్టింపు ఉంటుందని చెబుతున్నారు.

కిరాణాకు వెళ్లిన బాలికతో అసభ్యంగా ...

ఆదివారం మధ్యాహ్నం నగరంలోని ఎన్జీఓ కాలనీలో ఒక 11 ఏళ్ల బాలిక ఇంటికి సమీపంలోని కిరాణా దుకాణంలో నూడుల్స్ కొనేందుకు వెళ్లింది. అప్పటికే మద్యం తాగి ఉన్న ఇద్దరు యువకులు అక్కడకు చేరుకొని బాలికతో అసభ్యంగా ప్రవర్తించడం మొదలు పెట్టారు. దాంతో ఆ బాలిక భయపడిపోయింది. ఇంటికి పరుగులు తీసింది. అయినా వదిలి పెట్టకుండా మద్యం మత్తులో ఆ యువకులు ఇంటివద్దకు వెళ్లి బాలికను వేధించారు. ఈ విషయాన్ని ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. వెంటనే ఆ బాలిక తండ్రి ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన ఎస్పీ పోలీసులను రంగంలోకి దించడమే కాకుండా నేరుగా ఆయన కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలికతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నిందితులు జయదీష్, అనూప్‌లను పట్టుకున్న పోలీసులు తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వీరి మీద రౌడీ షీట్ కూడా ఓపెన్ చేస్తామని ఎస్పీ చెప్పారు. ఈ ఘటన నగరంలో కలకలం సృష్టించింది. నిందితుల్లో ఒకరు నగరంలోని ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నట్లు సమాచారం.

కాటేసిన ముగ్గురు మృగాళ్లు

కేజీబీవీలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్న ఒక బాలిక తాను చదువుతున్న పాఠశాల మరుగుదొడ్లోనే ఒక మగ శిశువుకు జన్మనివ్వడం రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో పోలీసుల విచారణలో కళ్లు బైర్లు కమ్మే విషయాలు బయటపడ్డాయి. తెలంగాణ ప్రాంతానికి చెందిన సదరు బాలిక కుటుంబం జిల్లాలోని చీమకుర్తి ప్రాంతంలో నివాసం ఉంటోంది. తండ్రిలేని బాలిక తల్లి కూలి పనులు చేసుకుంటూ బిడ్డను చదివిస్తోంది. పాఠశాలకు వెళ్లి వస్తున్న బాలికపై కన్నేశాడు పారే సైదాబాబు అనే కీచకుడు. ప్రేమపేరుతో మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. వీరిద్దరి వ్యవహారం శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి కంటపడింది. దాంతో ఆ బాలికను బెదిరించి, డబ్బు ఆశ చూపి లొంగదీసుకున్నాడు. ఈ విషయం మరో వ్యక్తి వెంకటరెడ్డికి తెలిసింది. అతడు కూడా ఆ బాలికను బ్లాక్ మెయిల్ చేసి శారీరక కోరికలు తీర్చుకున్నాడు. ఈ ముగ్గురు మృగాళ్ల పాపంతో బాలిక గర్భవతైంది. చివరికి పాఠశాల మరుగుదొడ్డిలో బిడ్డను కనింది. ఈ ఘటన మన కళ్ల ముందే తిరుగుతున్న మానవ మృగాల నిజస్వరూపాన్ని బయటపెట్టింది. ఆడపిల్లల తలిదండ్రులను మరింతగా అభద్రతలోకి నెట్టింది. ఆడపిల్లలను గుండెల్లో దాచుకోవాల్సిన రోజులు దాపురించాయని భయాందోళనలకు గురవుతున్నారు.

కూతురితో మాట్లాడవద్దన్నందుకు దాడి..

మార్కాపురం పట్టణానికి చెందిన ఒక బాలిక ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. అదే కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సీనియర్ విద్యార్థి ఆమె వెంటపడి వేధిస్తున్నాడు. విషయం తెలిసిన బాలిక తండ్రి సత్యనారాయణ సదరు విద్యార్థిని మందలించారు. తనను మందలించడాన్ని సహించలేకపోయిన సీనియర్ విద్యార్థి సోదరుడితో కలిసి ఏకంగా బాలిక ఇంటి వద్దకు వెళ్లి దాడికి పాల్పడ్డాడు. కత్తితో దాడి చేసి కొట్టడంతో సత్యనారాయణ గాయపడ్డాడు. తల మీద కత్తి గాట్లు పడ్డాయి. అప్రమత్తంగా వ్యవహరించడంతో చిన్న గాయాలతో ఆయన బయటపడ్డాడు. ఒకవేళ తగలరాని చోట దెబ్బ తగిలి ఉంటే పరిస్థితి ఏమయ్యేదో ఊహించలేని పరిస్థితి. ప్రస్తుతం ఆయన మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. శనివారం జరిగిన ఈ సంఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. కేవలం తన కూతురితో మాట్లాడవద్దని మందలించడమే ఆ తండ్రి చేసిన నేరమైపోయింది.



యువకుల దాడిలో గాయపడిన తండ్రి

కేవలం ఐదు రోజుల్లోనే మూడు ఘటనలు

కేవలం ఐదు రోజుల్లోనే ఈ మూడు ఘటనలు జరగడం జిల్లాలో పరిస్థితిని అద్దం పడుతోంది. గత నెల 31వ తేదీ బాలిక డెలివరీ కేసు బయటపడగా, శనివారం మార్కాపురంలో బాలిక తండ్రి మీద కత్తితో దాడి చేశారు. ఆదివారం ఒంగోలు నగరంలో బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన జరిగడం చర్చనీయాంశంగా మారింది. బాలికల పాఠశాలు, కళాశాల వద్ద పోలీసు గస్తీ పెంచడంతో పాటుగా విద్యార్థినులు, బాలికల్లో అవగాహన పెంపొందించే చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. నిందితులను కఠినంగా శిక్షించడం ద్వారా కూడా నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయని ప్రజా సంఘాలు చెబుతున్నాయి.

ఉన్నట్టా.. లేనట్టా !

ప్రభుత్వ జూనియర్ కాలేజీల కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ సమస్య త్రిశంకు స్వర్గంలో నిలిచినట్లయింది. ఏటా కాలేజీలు ప్రారంభించే నాటికే కాంట్రాక్టు లెక్చరర్లను రెన్యువల్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యేవి. కానీ ఈ ఏడాది ఇంత వరకు ఉత్తర్వులు జారీ కాకపోవడంతో అధ్యాపకుల్లో ఆందోళన నెలకొంది.

- నిలిచిన జూనియర్ కాలేజీ కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్
- రెన్యువల్ కూడా లేక మూడు నెలలుగా జీతాల కోసం ఎదురుచూపులు
- జిల్లాలో 476 మంది ప్రభుత్వ జూనియర్ కాలేజీ కాంట్రాక్టు లెక్చరర్లు
- ఏప్రిల్ 30తో ముగిసిన కాంట్రాక్టు లెక్చరర్ల సేవలు



ఒంగోలు: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేసే కాంట్రాక్టు లెక్చరర్లు మూడు నెలలుగా జీతాలు లేక, రెన్యువల్‌కూ నోచుకోక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3618 మంది, జిల్లాలో 476 మంది కాంట్రాక్టు లెక్చరర్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్నారు. ఏప్రిల్ 30తో లెక్చరర్ల కాంట్రాక్టు ముగిసినా వారి సేవలు మాత్రం వేసవిలో సైతం నిరంతరాయంగా కొనసాగించారు. గత ప్రభుత్వంలో 12 నెలలకు జీతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో మే, జూన్, జూలై నెలలకు సంబంధించి జీతాలు విడుదల కావాల్సి ఉంది. నాలుగో నెల గడుస్తున్నా ఇంకా రెన్యువల్ ఉత్తర్వులు విడుదల కాకపోవడంతో అధ్యాపకుల కుటుంబాలు ఆకలి కేకలతో విలవిల్లాడుతున్నాయి.

2000 సంవత్సరంలో వ్యవస్థ ప్రారంభం:

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 2000 సంవత్సరంలో మొదలుపెట్టిన కాంట్రాక్టు అధ్యాపక వ్యవస్థలో పనిచేస్తున్న అధ్యాపకుల అవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ వ్యవస్థలో నియామకాల ప్రక్రియ 2012తో ముగిసింది. రెన్యువల్ విధానంలో కొనసాగుతున్న వ్యవస్థలో ఉద్యమ పోరాటాలు సాగించి వేతన పెంపు, సెలవుల వర్తింపు, ఏడాదిలో 12 నెలల కాలానికి సర్వీస్ వంటివి సాధించినా ఇప్పటికీ చాకిరీ తప్ప, తగిన ఉద్యోగ భద్రత లేక అలమటిస్తున్నారు.

12 నెలల కొనసాగింపునకూ కోతలు?

మే నెలలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు తరగతులు, అడ్మిషన్ క్యాంపెయిన్ విధులు, ఎన్నికల డ్యూటీలు, పరీక్షల విధులు, మూల్యాంకనం విధుల్లో అధికారులు కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసును ఉపయోగించుకున్నారు. గతంలో ఎన్నికల స్టంట్ మాదిరిగా చంద్రబాబు ప్రభుత్వం దిగేటప్పుడు ఏర్పాటు చేసిన మంత్రివర్గం ఉపసంఘం, ఎంఎల్‌సీ ఉన్నతాధికారులు వారి సర్వీసు కమిటీ 10 రోజుల బ్రేక్‌తో 12 నెలల కాలానికి కాంట్రాక్టు లెక్చరర్ల సేవలు ఉంచాలని నవంబర్ 2018న నిర్ణయించింది. అయితే తక్షణం అమలు చేయకుండా 2019 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చేలా వచ్చే ప్రభుత్వంపై వేసి చేతులు దులుపుకున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 12 నెలల కాలానికి జీతాలు అమలయ్యేలా చర్యలు తీసుకుంది. అయితే మళ్లీ వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కుంటి సాకులతో మేనెల జీతానికి ఎసరు పెట్టే దిశగా చూస్తోందని తెలుసుకుని కాంట్రాక్టు లెక్చరర్లు మండిపడుతున్నారు. ఆర్థికశాఖ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయం, ఇంటర్ కమిషనరేట్ కార్యాలయాల ఉన్నతాధికారులు కుంటి సాకులు, అనవసర అభ్యంతరాలు వ్యక్తం చేసి, పాలనాపరంగా సాధారణంగా జరగాల్సిన రెన్యువల్ ప్రక్రియను కూడా తాత్సారం చేస్తున్నారు.

రెగ్యులరైజేషన్ ఏమైనట్లు?

ఇదిలా ఉంటే కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు ప్రతి చోట కాంట్రాక్టు లెక్చరర్లు తమ సమస్యలను విన్నవించారు. క్రమబద్ధీకరించమని అభ్యర్థించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుచేసి అధ్యయనం చేయించి రెగ్యులరైజేషన్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న 10,117 మందిని గుర్తించి వారిలో 2014 జూన్ 2 నాటికి అయిదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని క్రమబద్ధీకరించాలని తొలుత నిర్ణయం తీసుకున్నారు. మళ్లీ కాంట్రాక్టు ఉద్యోగుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 2014 జూన్ 2 నాటికి సర్వీసులో ఉన్నవారందరినీ రెగ్యులర్ చేయనున్నట్లు ప్రకటించారు. ఏపీ చట్టసభల్లో నూతనంగా 30 యాక్టును రూపొందించి ఆమోదించి దానికి అనుగుణంగా జీవో నంబర్ 114ను జారీ చేశారు. అయితే వివిధ కారణాలతో జాప్యం జరిగి ఎన్నికల కోడ్ ముంగిట రెగ్యులరైజేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. గత ప్రభుత్వంలో ప్రకటించిన 10,117 పోస్టుల్లో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్లు కోరుతున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి



మాతోపాటు ఇప్పటికే పనిచేసిన కాంట్రాక్టు ఉద్యోగులంతా ఏప్రిల్ 1 నుంచి రెగ్యులర్ అయ్యారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన రెగ్యులరైజేషన్ ప్రక్రియను చేపట్టి అడ్డంకులు లేకుండా కాంట్రాక్టు లెక్చరర్లు అందరినీ పర్మినెంట్ చేయాలి.

– పి.ప్రభుదాస్, కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ చైర్మన్

12 నెలలతో రెన్యువల్ ఉత్తర్వులు విడుదల చేయాలి



12 నెలలతో కూడిన రెన్యువల్ ఉత్తర్వులు త్వరగా విడుదల చేయాలి. రెగ్యులర్ కాకపోవడంతో మేము తీవ్రంగా నష్టపోతున్నాం. రెన్యువల్ ఉత్తర్వులు కూడా విడుదల కాకపోవడంతో మూడు నెలలుగా జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. విద్యాశాఖమంత్రి గత ఐదేళ్లలాగే ఎటువంటి బ్రేక్ లేకుండా రెన్యువల్ ఉత్తర్వులు జారీచేయడంతోపాటు రెగ్యులరైజేషన్ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలి.

– జీఎస్ స్వప్నలత, కోశాధికారి, కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ

జిల్లా యోగ క్రీడాకారులు వీరే



తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తున్న క్రీడాకారులు

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా యోగ క్రీడాకారుల ఎంపికలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.శివాజీ, డీఎల్ కిరణ్మయి తెలిపారు. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో వీరిని ఎంపిక చేశారు.

బాలుర విభాగం:

8–10 ఏళ్ల వయస్సు: టీవీ చైతన్య (గొల్లపల్లి), జి.భద్రీనాథ్ (చీరాల)
10–12 ఏళ్లు: కేజై సుందర్పాల్ (చీరాల), పి.సైఫుద్దీన్ ఖాన్ (చీరాల)
12–14 ఏళ్లు: ఎం.వెంకటేష్ (చందలూరు), పీవీ వీరాంజనేయులు (తిమ్మాపురం)
14–16 ఏళ్లు: ఐ.వరుణ్‌సాయి (పీసీపల్లి), కె.భార్గవ్ (కొత్తపేట)
18–21 ఏళ్లు: కె.భరత్‌కుమార్‌రెడ్డి (ఒంగోలు), ఎస్.సిద్దిసాయిబాబా (ఒంగోలు)
21–25 ఏళ్లు: బి.భాస్కరరావు (ఒంగోలు)

బాలికల విభాగం:

8–10 ఏళ్లు: వివి హర్షిణి (వెంగళాపురం), సీహెచ్ శివమన్విత (విక్కిరాలపేట)
10–12 ఏళ్లు: ఎ.లిఖిత (చందలూరు), ఎస్.గ్రేష్మి (చీరాల)
12–14 ఏళ్లు: ఎస్.శృతి (చందలూరు), ఓవీ రేణుక (గొల్లపల్లి)
14–16 ఏళ్లు: కె.శాంతి (పామూరు), కె.క్రాంతి ప్రసన్న (పెద్దదోర్నాల)
18–21 ఏళ్లు: ఎఉదయ్‌శ్రీని శ్వేత (ఒంగోలు), ఎస్.చిన్మయి సాయిచంద్ర (ఒంగోలు)
25–30 ఏళ్లు: యు.సుశీల (వల్లాయిపాలెం)
35–40 ఏళ్లు: ఎస్.రాధ (గొల్లపల్లి), బి.ప్రశాంతి (ఒంగోలు)

25 నుంచి రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు

ఒంగోలు: అన్నమయ్య జిల్లా రేణిగుంట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 25, 26 తేదీల్లో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ గ్రాఫింగ్ స్టైల్ సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికలు, సీనియర్ రెజ్లింగ్ పోటీలు జరుగుతాయని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.సురేష్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 8790495111 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అమృత ధారలు

- తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెంపు
- ఈ నెల 8వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



ఒంగోలు సిటీ:

బిడ్డ భూమిపైకి వచ్చి కళ్లు తెరిచిన తొలి క్షణం చూసేది తల్లి ముఖాన్నే.. వెతికేది తల్లిపాలనే. శిశువు ఆయుష్షు, ఆరోగ్యం పెంచడంలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయి. అమ్మపాలు అమృతంతో సమానం. బిడ్డకు తొలి ఆహారం అమ్మపాలు. ఇది ప్రకృతి వరం. దీనికి మరేదీ సాటిరాదు. అయితే కొన్ని అపోహలు ఉన్నాయి.. ఆధునిక పోకడలతో కొందరు తల్లులు బిడ్డలకు శ్రేష్టమైన తల్లిపాలను దూరం చేస్తున్నారు. దీంతో ఏటా శిశు మరణాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ తల్లిపాల విశిష్టతను తెలియజేస్తున్నారు.

రోగ నిరోధకశక్తి పెరుగుతుంది:

పుట్టిన గంటలోపే శిశువుకు ముర్రుపాలు తప్పనిసరిగా తాగించడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. కామెర్లు, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులను నిర్మూలించే గుణాలు తల్లిపాలలో ఉన్నాయి. పగటి పూట ఇచ్చే పాల కన్నా రాత్రిపూట బిడ్డకు పాలివ్వడం ద్వారా బిడ్డ ఎదుగుదల బాగా ఉంటుంది. ఫలితంగా తల్లికి, బిడ్డకు మంచి బంధం ఏర్పడుతుంది. పాలిచ్చేటప్పుడు తల్లిఒడిలోని వేడి వల్ల బిడ్డకు చేరి చాలా వ్యాధులు దరిచేరవు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగిస్తే శిశుమరణాలు తగ్గుతున్నట్లు అధ్యయనాల ద్వారా వెల్లడైంది.

కేన్సర్ బారిన అవకాశాలు తక్కువ...

శిశువుకు తొలి ఆరునెలలు బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లికి రొమ్ము కేన్సర్ బారినపడే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. ప్రస్తుతం అనేక మంది స్త్రీలు రొమ్ము కేన్సర్ బారిన పడుతున్నారు. దీనికి ముఖ్య కారణం బిడ్డకు పాలివ్వకపోవడమే.

8వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు:

జిల్లాలోని 13 ఐసీడీఎస్ ప్రాజెక్టుల కింద 2903 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 6 నెలల నుంచి 3 సంవత్సరాల్లోపు పిల్లలు 58,388 మంది, 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల్లోపు ప్రీ స్కూల్ పిల్లలు 46,392 మంది, 11,733 మంది గర్భిణులు, 10,006 మంది బాలింతలు లబ్ధిపొందుతున్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు తల్లిపాల ప్రాముఖ్యత, ముర్రుపాలతో కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే సభలు, సదస్సులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు:	అంగన్‌వాడీ కేంద్రాలు:
13	2903

6 నెలల నుంచి 3 సంవత్సరాల్లోపు పిల్లలు 58,388 మంది

ప్రీ స్కూల్ పిల్లలు: 46,392 మంది

గర్భిణులు: 1,733 మంది

బాలింతలు: 10,006 మంది

గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత తెలుపుతున్నాం



తల్లిపాల వారోత్సవాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాం. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం. 6 నెలల వరకు బిడ్డకు తల్లిపాలిస్తే ఆరోగ్యం పెరుగుతుంది.

– కె.మాధురి, ఐసీడీఎస్ పీడీ

క్లుప్తంగా

పాఠశాలలో అగ్ని ప్రమాదం

- విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తోనే
- రూ.2 లక్షల మేర సామగ్రి దగ్ధం



ప్రమాదానికి గురైన స్టాక్ రూంను పరిశీలిస్తున్న ఎంఈఓ ఆంజనేయులు

యర్రగొండపాలెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టాక్ రూంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో దాదాపు రూ.2 లక్షల మేర ఆస్తికి నష్టం వాటిల్లి ఉండవచ్చని హెచ్‌ఎం వేముల పిచ్చిరావు తెలిపారు. పాఠశాల స్టాక్ రూంలో పొగలు వస్తున్నట్లు గుర్తించిన వాచ్‌మెన్ షేక్.ఖాశిం తనకు సమాచారం ఇచ్చాడని, వెంటనే తాను ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేసి చెప్పినట్లు ఆయన తెలిపారు. స్టాక్ రూంలో దాదాపు రూ.2 లక్షల విలువైన ప్రొజెక్టర్, పాత టీవీలు, పరీక్ష సామాగ్రి దగ్ధమయ్యాయని తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన పాఠశాల వద్దకు చేరి మంటలను అదుపు చేశారు. ఎంఈఓ పి.ఆంజనేయులు ప్రమాదానికి గురైన పాఠశాల స్టాక్ రూంను పరిశీలించారు.

కొత్త నేర చట్టాల అమలును ఉపసంహరించుకోవాలి

ఒంగోలు టౌన్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలు అమలు చేయకుండా ఉపసంహరించుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటినపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఒంగోలు నగరంలోని అద్దంకి బస్టాండులో మిత్రా స్టాండ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సభ నిర్వహించారు. బ్రహ్మయ్య అధ్యక్షత వహించగా, గంటినపల్లి మాట్లాడుతూ కొత్త చట్టాలకు అనుగుణంగా వచ్చిన జీవో నంబర్ 21 రవాణా కార్మికులపై కత్తిలాగా భయపెడుతోందని చెప్పారు. రోజువారీ పనులు చేసుకునే కార్మికులపై చలానాలు, జరిమానాలు పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం 17 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫెడరేషన్ అధ్యక్షునిగా పి.తిరుమలయ్య, కార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా కొండయ్య, కొండారెడ్డి, ఆనంద్, రామిరెడ్డిలను ఎన్నుకున్నారు. ఫెడరేషన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



రాజంపల్లి వద్ద చుక్కనీరు లేకుండా ఎండిపోయిన చెరువు



మూసీ వాగులో చుక్క నీరు లేక ఏపుగా పెరిగిన ముళ్లచెట్లు



కొత్తరెడ్డిపాలెం సమీపంలో వర్షం లేక ఎండిపోతున్న పశువుల మేత

రిపీట్ 2014-19..!

- రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే జిల్లాలో కరువు పరిస్థితులు
- రైతులను వెంటాడుతున్న వర్షాభావం
- వాడుముఖం పట్టిన ఖరీఫ్ పంటలు
- ఎక్కడా కనిపించని పచ్చదనం
- పచ్చిక సైతం ఎండిపోతున్న వైనం
- దిక్కుతోచని స్థితిలో రైతులు



వర్షాలు లేక దర్శి ప్రాంతంలో వాడుముఖం పట్టిన కంది పంట

దర్శి:

గత ఐదేళ్లుగా విస్తారంగా వర్షాలు కురిసాయి. నదులు, వాగులు, వంకలు వరద నీటి ప్రవాహంతో పరవళ్లు తొక్కాయి. ప్రాజెక్టులు నిండాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. వ్యవసాయానికి, తాగునీటికి సరిపడా నీరందింది. ఆనాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా నగదు అందించడంతో పాటు అన్నదాతలకు సకలం సమకూర్చడంతో పాడిపంటలతో జిల్లా ప్రకాశించింది. ప్రస్తుతం ఒక్కసారిగా పరిస్థితి తారుమారైంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయి చంద్రబాబు సీఎం అవగానే గతంలో ఆయన పరిపాలించిన 2014–19 నాటి పరిస్థితులు జిల్లాలో పునరావృతమవుతున్నాయి. ఖరీఫ్ మొదలై రెండు నెలలైనా జిల్లాలో సరైన వర్షాల కోసం రైతన్నలు ఎదురుచూస్తుండటమే అందుకు నిదర్శనంగా ఉంది. అరకొరగా కురిసిన వర్షాలకు కంది, పత్తి, జొన్న, పొగాకు వంటి పైర్లను రైతులు సాగుచేశారు. జిల్లాలో 3,53,442 ఎకరాల ఖరీఫ్ సాగు లక్ష్యం కాగా, కేవలం 45,275 ఎకరాల విస్తీర్ణంలో మాత్రమే విత్తనాలు నాటారు. అంటే..సాగు లక్ష్యంలో 13 శాతం మాత్రమే పంటలు వేశారు. వర్షాభావం కారణంగా ఆయా పంటలు కూడా వాడుముఖం పట్టాయి. ఎక్కడా పచ్చదనం కనిపించడం లేదు. పచ్చిక సైతం ఎండిపోయి పశుగ్రాసానికి కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రైతులతో పాటు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే పశుపోషకులు కూడా దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే జిల్లాను కరువు కాటేయడం ఖాయంగా కనిపిస్తోంది.



దొనకొండ మండలం గట్టుమీదపల్లిలో దుక్కి దున్ని వర్షం కోసం ఎదురుచూస్తున్న పొలం

బీడువారుతున్న పొలాలు...

జిల్లాలో కంది, పత్తి, జొన్న, పొగాకు పంటలు సాగు చేశారు. కానీ, వర్షాలు లేకపోవడంతో పచ్చగా కళకళలాడాల్సిన పైర్లు, పల్లెటూళ్లు వెలవెలబోతున్నాయి. ఎటుచూసినా ఎండుముఖం పట్టిన పంటలు, దుక్కి కోసం ఎదురు చూస్తున్న పొలాలు, వర్షం కోసం ఎదురు చూస్తున్న నేలలే దర్శనమిస్తున్నాయి. అడపాదడపా కురిసిన వర్షాలకు సాగుచేసిన పంటలు కూడా ఎండిపోవడంతో నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. పశుగ్రాసం సైతం ఎండిపోయి పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువుల మేత, నీటికి కూడా కష్టంగా ఉందంటున్నారు. గేదెలను ఎక్కడికి తోలుకెళ్లినా పచ్చిక కనిపించడం లేదు. చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. వాగుల్లో చుక్కనీరు కనిపించక పిచ్చిచెట్లు మొలిచాయి. గ్రామాల్లో ఏ చెరువుల్లో చూసినా చుక్క నీరు లేదు.

సాగర్ నీటితో చెరువులు నింపితే కొంత మేలు...

సాగర్ జలాలతో కనీసం చెరువులు నింపితే సాగర్ ఆయకట్టులో కొంత మేలు జరిగే అవకాశం ఉంది. బోర్లు రీచార్జ్ అయి రైతులు కొంత మేరకు నీటి ఇబ్బందులు అధిగమించవచ్చు. ఇటీవల సాగర్ కుడికాలువకు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రస్తుతం జలాశయాల్లోకి భారీగా నీరు చేరుకుంది. అయినప్పటికీ నీటిని నిలిపివేయడంతో చెరువులకు నీరు వచ్చే అవకాశం లేకుండా పోయింది. సాగర్ నీటి విడుదల కొనసాగించి చెరువులు నింపితే రైతులకు కొంత ఊరట ఉంటుంది. ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడంతో పాటు కొంత ఆయకట్టుకు నీరందించి పంటలు సాగుచేసుకునే వీలుంటుంది. వర్షాలు లేక రైతులు తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు. సాగర్ కుడికాలువ ద్వారా కనీసం ఒక తడికి ఆయకట్టుకు నీరు విడుదల చేస్తే దర్శి, యర్రగొండపాలెం, సంతనూతలపాడు నియోజకవర్గాల ఆయకట్టు పరిధిలో మెట్టపైర్లకు ఆరుతడులిచ్చి బతికించుకోవచ్చు. వర్షాలు లేక నైరాశ్యంలో ఉన్న రైతులకు కొంత ఊరట కలుగుతుంది.

పండ్ల తోటలు ఎండుముఖం...

వర్షాలు లేక నీటి బోర్లు కూడా అడుగంటాయి. తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెం గ్రామంలో బత్తాయి తోటల్లో చెట్లకు నీరులేక ఎండిపోతున్నాయి. మరికొన్ని రోజులు ఇలాగే ఉంటే బత్తాయి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. గత 2014 నుంచి 2019 వరకు ఉన్న కరువు పరిస్థితులు జిల్లాలో మళ్లీ తాండవం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగుచేసిన పంటల్లో ఎక్కువ శాతం వాడుముఖం పట్టడంతో వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.



తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెంలో ఎండిపోతున్న బత్తాయి చెట్లు

మబ్బులు పట్టి ఊరించి ఉసూరుమనిపిస్తున్నాయి :



రోజూవానకురుస్తున్నట్లు మబ్బులు పట్టి ఊరిస్తున్నాయి. తీరా చూస్తే సన్నని జల్లు కురిసి వెళ్లిపోతోంది. ప్రతిరోజూ వాన కోసం ఎదురు చూడటమే మా పనైంది. ఈ పాటికి పైర్లు సుమారు నాలుగు అడుగులఎత్తు ఉండాల్సిఉంది.ఇంతవరకు చినుకు రాలలేదు. ఈ ఏడాది ముంచుద్దేమోనని భయంగా ఉంది.

కాటం అంకిరెడ్డి, కాటంవారిపల్లె, కురిచేడు మండలం

మొక్కలు ఎండిపోతున్నాయి :



కురిసిన చిన్నపాటి జల్లులకు పొగమొక్కలు నాటాను. తీరా చూస్తే అవి కూడా ఎండిపోతున్నాయి.వానని నమ్ముకుని పెట్టుబడి పెట్టాను. అదంతా వృథా అయ్యే పరిస్థితి కనబడుతోంది. అసలు ఆ నాలుగు చినుకులు కురవకపోయినా పెట్టుబడి పెట్టేవాడినికాదు.అనవసరంగా పెట్టుబడి పెట్టిన తర్వాత వాన వెనక్కుపోయి నష్టపరిచింది.

నుసుం కోటిరెడ్డి, కురిచేడు

పంటల సాగుకు అంతా సిద్ధం చేసుకున్నా :



ఇంతకుముందులాగా సకాలంలో వానలు కురుస్తాయని పొలమంతా సిద్ధం చేసుకున్నాను. గత ఐదేళ్లలో ఇంత దారుణంగా వానలు లేకుండా ఎన్నడూ లేదు. ఈ ఏడాది కూడా వానలు పడతాయని ఆశపడ్డాను. కానీ, నా ఆశ నిరాశ అయ్యేలా ఉంది. దేశమంతా మునిగిపోయేలా వానలు కురుస్తున్నా.. మన జిల్లాలో మాత్రం ఎండాకాలంలా ఉంది.

గుంటక నాగిరెడ్డి, కురిచేడు

పేట్రేగిపోతున్న టీడీపీ నేతలు

- మాజీ డీలర్‌పై దాడి
- తలకు తీవ్ర గాయం
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



తలకు గాయమైన సుబ్రహ్మణ్యం

కురిచేడు: రేషన్ సరుకులున్న గదికి సంబంధించిన తాళం, సిమ్ కార్డు ఇవ్వమన్నందుకు మాజీ డీలర్ తలపగలగొట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎన్‌ఎస్‌పీ అగ్రహారం మాజీ డీలర్ రాచకుంట్ల సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. రెండు నెలల క్రితం వరకు డీలర్‌గా ఉన్న సుబ్రహ్మణ్యం.. కమిటీ హాలులో రేషన్ సరుకులు దింపుకుని తన సొంత తాళం వేసుకున్నాడు. తన వేయింగ్ మిషన్‌కు ప్రభుత్వ అధికారులు సిమ్‌కార్డు ఇవ్వకపోవటంతో తన సొంత సిమ్ కార్డు వేయించుకుని రేషన్ సరుకులు కార్డుదారులకు అందజేశాడు. కాగా రెండునెలల క్రితం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రాజీనామాలు చేయాలనడంతో తన డీలర్ పదవికి రాజీనామా చేశాడు. ఆ సమయంలో 19 క్వింటాళ్ల బియ్యం తరుగు ఉండటంతో 38 వేల రూపాయలు చెల్లించాడు. అయితే గత శుక్రవారం శ్రీ అంకాలపరమేశ్వరి ఆలయం వద్ద ఎంపీటీసీ సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ ఏడుకొండలు, గ్రామ నాయకుడు నాగరాజులు ఉండగా.. అక్కడకు వెళ్లి తన సిమ్ కార్డు, తాళం ఇవ్వాలని సుబ్రహ్మణ్యం అడిగాడు. దీంతో వారి మధ్య ఘర్షణ.. జరిగి తోపులాట జరిగింది. సుబ్బారావు తనను దుర్భాషలాడుతూ తలపై రాడ్డుతో కొట్టడంతో తలకు గాయమైందని సుబ్రహ్మణ్యం తెలిపాడు. వెంటనే దర్శి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్నాడు.

తలకు గాయమైంది: ఎస్సై శ్రీకాంత్

మాజీ డీలర్ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సుబ్బారావు మధ్య తోపులాట జరిగి సుబ్రహ్మణ్యం కింద పడటంతో ఆయన తలకు గాయమైందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. దర్శి ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వేయింగ్ మిషన్, సిమ్ కార్డు కోసం మాజీ డీలరు రాచకుంట్ల సుబ్రహ్మణ్యం.. ప్రస్తుత డీలరు యోగయ్య వద్దకు వెళ్లాడన్నారు. వారి మధ్య తోపులాటలో సుబ్రహ్మణ్యంకు గాయమైందని తెలిపారు.

ఆరోగ్యంపై పోలీసు సిబ్బంది శ్రద్ధ చూపాలి

- పోలీసు కళ్యాణ మండపంలో ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభించిన ఎస్పీ దామోదర్



పోలీసులకు వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో నిత్యం ఒత్తిడికి గురయ్యే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం స్థానిక పోలీసు కళ్యాణ మండపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎస్పీ మాట్లాడుతూ సహజంగా పోలీసు సిబ్బంది తమ ఆరోగ్య రక్షణ కంటే ప్రజా భద్రతకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటారని, కానీ సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నా.. కుటుంబ బాధ్యతలు నెరవేర్చాలన్నా ఆరోగ్యంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ ముందస్తుగా తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. స్వల్ప అనారోగ్య లక్షణాలు కనిపించినా ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని, వీలైనంత త్వరగా వైద్య చికిత్స చేయించుకోవాలని సూచించారు. వృత్తిలో భాగంగా కుటుంబానికి దూరంగా ఉండటం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం వలన ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, నిత్యం వ్యాయామం చేయడం, మెడిటేషన్, యోగా లాంటివి చేయడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకునే అవకాశం ఉంటుందన్నారు. పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం భద్రంగా ఉంటుందని చెప్పారు. పోలీసు సిబ్బంది కోసం తరచూ మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు ఉమాపతి చౌదరి, కె.అనిల్, యు.శ్రీనివాసులు, సీహెచ్ శ్రీధర్, పోలీస్ యూనిట్ డాక్టర్ భానుమతి పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎముకలు, ఊపిరితిత్తులు, గుండెజబ్బులు, జీర్ణాశయ వ్యాధులు, జనరల్ మెడిసిన్‌కు సంబంధించి ఉపాస్ హాస్పిటల్ వైద్య బృందం పరీక్షలు చేసింది. అవసరమైన వైద్య సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ భీమానాయక్, ఆర్‌ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాకీ ఎగ్గొట్టాడని కేసు నమోదు

కురిచేడు: బాకీ తీసుకొని ఎగ్గొట్టాడని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన అడుసుమల్లి వెంకట అప్పారావు అదే గ్రామంలో నివసిస్తున్న బీ వేణుగోపాల్ కు గత ఏప్రిల్ నెలలో రూ.8.60 లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఆ అప్పును తిరిగి చెల్లించమన్నందుకు వేణుగోపాల్ గ్రామంలో లేకుండా వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం



ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వంశీకృష్ణ



గాయపడ్డ చంద్రశేఖరరెడ్డి

- బస్సును తప్పించబోయి రక్షణ గోడను ఢీకొన్న ద్విచక్రవాహనం
- ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు

పెద్దదోర్నాల: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి ఓ ద్విచక్రవాహనం అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొట్టింది. ఈ సంఘటన మండల పరిధిలో శ్రీశైలం ఘాట్ రోడ్డులోని బోడేనాయక్ తాండా సమీపంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనలో చిలకలూరిపేట మండలం మోదుకొండావారిపాలెం గ్రామానికి చెందిన వంశీకృష్ణ, చంద్రశేఖరరెడ్డి తల, కాళ్లకు తీవ్రమైన గాయాలయ్యాయి. ఎస్సై అంకమరావు కథనం మేరకు..శ్రీశైలంలో దైవదర్శనం ముగించుకుని స్వగ్రామమైన చిలకలూరిపేటకు వెళ్తున్న ద్విచక్రవాహనం ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న రక్షణ గోడను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సంఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకొని గాయపడిన ఇద్దరిని పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్య సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించారు. కాలికి, తలకు గాయాలు తీవ్రంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం నర్సరావుపేటకు తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై అంకమరావు వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ప్రమాదానికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

సర్దుబాటు ప్రక్రియ నిలిపివేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

ఒంగోలు: ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే ప్రక్రియను కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నిలిపివేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వి.జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం జిల్లా సబ్ కమిటీ, రాష్ట్ర కౌన్సిలర్ల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవో నంబర్ 117ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. పని సర్దుబాటు జీఓ వల్ల జిల్లాస్థాయి, మండల స్థాయిలలో నిర్వహించకుండా రాష్ట్ర స్థాయిలో కమిషనరేట్ నుంచి జరపాలని నిర్ణయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రఘుబాబు మాట్లాడుతూ గతంలో చేసిన సర్దుబాటు వల్ల ఉపాధ్యాయులకు ఇబ్బంది తలెత్తితే జిల్లాస్థాయి, మండల స్థాయి అధికారులు పరిష్కరించేవారన్నారు. ఇప్పుడు ఆ అవకాశం కూడా ఇవ్వకుండా కమిషనరేట్ నుంచి నిర్వహించడం సరైన విధానం కాదన్నారు. 10 మంది విద్యార్థుల లోపు ఉన్న పాఠశాలలను మూసివేసే ప్రయత్నం కూడా చేస్తున్నట్లు తెలుస్తుందని, ఇది విద్యారంగానికి, పాఠశాలల మనుగడకు తీవ్ర హాని చేసే నిర్ణయమన్నారు. విద్యాశాఖలో నెలనెలా పదోన్నతులు ఇచ్చే విధంగా ఆదేశాలు ఉన్నాయని కానీ ఏడాది కాలంగా ఈ ఉత్తర్వులు అమలు కావడంలేదన్నారు. వెంటనే పదోన్నతులు చేపట్టి ఉన్నత క్యాడర్‌లో నియమిస్తే పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుందని, ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు వేలమంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేశారన్నారు. ప్రస్తుతం అనేక ఉన్నత పాఠశాలలు ఇద్దరు లేక ముగ్గురు ఉపాధ్యాయులతో కొనసాగుతున్నాయన్నారు. జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు అవుతున్నా కనీసం ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటుచేయలేదని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే విధంగా ఉపాధ్యాయ సంఘాల సమావేశం ఏర్పాటుచేయాలన్నారు. సమావేశంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు ఎస్‌కే నాయబ్ రసూల్, బి.శేషారావు, కె.తిరుమల, పి.హనుమంతరావు, పి.శేఖర్‌రెడ్డి, సీహెచ్ శివరామకృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్లు కె.శ్రీనివాసరావు, జె.వెంకటేశ్వర్లు, ఎం.యోహాన్‌రెడ్డి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి విజయసారథి, పూర్వ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ఎస్.గురునాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరుగురు జూదరుల అరెస్టు

ముండ్లమూరు: మండలంలోని ఉమామహేశ్వరపురం గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు. గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఆదివారం సిబ్బందితో కలిసి దాడి చేశారన్నారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 11030 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని..వారిపై పెట్టి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొక్కలు నాటిన సత్యసాయి సేవా సంఘం

పెద్దదోర్నాల: అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్యసాయి సేవా సంఘం ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి రేంజి అధికారి విశ్వేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుని మనుగడ, పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని పిలుపునిచ్చారు. అడువులు వాటిలో జీవించే పెద్దపులులు, ఎన్నో జీవరాసుల సంరక్షణ బాధ్యత తమపై ఉందని, అలాగే పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు మొక్కల పెంపకమే శరణ్యమన్నారు. జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు తంగిరాల రామిరెడ్డి మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా లక్ష మొక్కలు నాటేలా తమ సంఘం నిర్ణయించిదన్నారు. అందులో భాగంగా పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

ఆస్తి వివాదంలో పరస్పర కేసులు నమోదు

ముండ్లమూరు: మండంలోని కెల్లంపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో ఆస్తి వివాదంలో ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వి. నాగమల్లేశ్వరరావు తెలిపారు. గ్రామానికి చెందిన కాసా నారాయణరెడ్డి, అల్లుడు పోలిరెడ్డి ఓబులరెడ్డి కుటుంబాలకు మధ్య ఆస్తి వివాదం కోర్టు వరకు వెళ్లింది. ఇదిలా ఉంటే రెండు రోజుల క్రితం ఇరువురు ఆస్తి వివాదంలో ఒకరిపై మరొకరు దాడి చేసుకొని గాయాలు కాగా వైద్యశాలలో చేరారు. కాసా నారాయణరెడ్డిపై అల్లుడు పోలిరెడ్డి ఓబులరెడ్డి దాడి చేయగా నారాయణరెడ్డికి గాయాలయ్యాయి. అదే సమయంలో కాసా నారాయణరెడ్డి రెండో భార్య తిరుపతమ్మ, మొదటి భార్య రెండో కుమార్తె శ్రీదేవిపై దాడి చేయగా ఆమెకి గాయాయలయ్యాయి. దీంతో కాసా నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు ఓబులరెడ్డిపై దాడి కేసు నమోదు చేశారు. శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతమ్మపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు.

కోట సత్యమాంబదేవికి పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

అది వనం కాదు.. కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయం స్టెయిర్ కేసు వద్ద మొలచిన చెట్లు



తహసీల్దార్ గది దక్షిణం వైపు గోడ పగలగొట్టుకుంటూ పెరుగుతున్న మర్రి

- తహసీల్దార్ కార్యాలయ గోడలు బద్దలు కొడుతున్న వేర్లు
- ప్రభుత్వ భవనమంటే అంత చులకనా?

కురిచేడు:

ఇంట్లో పెరటి మొక్కలు పెంచుతారో లేదో కానీ తమ కార్యాలయాల గోడలపై మాత్రం చెట్లను పెంచుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలం గోడపై చెట్ల పెరుగుతూ.. గోడలు పగిలిపోతున్నా తమకేమి సంబంధం లేదన్నట్లు అధికారులు, సిబ్బంది వ్యవహరించటం పలు విమర్శలకు తావిస్తోంది. తమ ఇళ్లపై చెట్లు వస్తే ఇలాగే ఉంటారా? అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా? అంటూ కార్యాలయానికి వచ్చిన వారు విమర్శిస్తున్నారు. మొక్కలుగా ఉన్నప్పుడే వాటిని పెరికి వేయించినట్లయితే ఇంత పెద్దచెట్లు గా పెరిగేవికాదు కదా అంటూ చూసిన వారంటున్నారు. తహసీల్దార్ గదికి దక్షిణం వైపు గోడలో పెద్ద మర్రి చెట్టు పెరుగుతూ గోడమొత్తం కూలిపోయే పరిస్థితి నెలకొంది. అలాగే మెట్లపై గోడ కూడా కూలి పోయే ప్రమాదం ఉంది. నీడినిచ్చే కార్యాలయం బాగోగులే పట్టించుకోని వారు ప్రజల సమస్యలను ఎలా పట్టించుకుంటారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయం నిర్వహణకు ప్రతి ఏటా వస్తున్న నిధులును దిగమింగి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు పెద్దలు గుసగుసలాడుకుంటున్నారు. కలెక్టర్ స్పందించి వెంటనే తహసీల్దార్ కార్యాలయాన్ని కాపాడే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోలేరమ్మ తల్లికి పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారు



అలంకరణలో శ్రీ అంకాళమ్మ దేవత



గంగాభవాని అమ్మవారికి పూజలు చేస్తున్న పూజారి

పెద్దదోర్నాల: సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ మండల పరిధిలో ఐనముక్కలలో పోలేరమ్మ తల్లికి భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైన వర్షాలు కురవక ఏరుక సాగని ప్రస్తుత తరుణంలో వర్షాలు బాగా పడాలని, పాడి పంటలు అభివృద్ధి చెందాలని పోలేరమ్మ తల్లికి 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆదివారం పోలేరమ్మ తల్లికి కుంకుమ బండిని అందంగా అలంకరించి గ్రామంలో పురవీధుల్లో కొమ్ము బూరలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో మహిళలు వారు పోసి పోలేరమ్మ కుంకుమబండికి స్వాగతం పలికి తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం కుంకుమబండిని గ్రామ పరిసరాల్లోని పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన శ్రీ వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీ, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన శ్రీ అంకాళమ్మ దేవతకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి వారికి సమర్పించారు. అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, గాజులు, చీరలు మహిళలు సమర్పించారు. కాటమరాజు ఆలయం చుట్టూ యాదవులు భక్తిశ్రద్ధలతో దేవాలయం ప్రాంగణంలో స్వామి చుట్టూ బొల్లావును నెత్తిన పెట్టుకుని తప్పెట్లతో ఊరేగింపుగా ఆనందోత్సవంతో ప్రదక్షిణలు చేశారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కబడులు చెల్లించారు.

గుంటిగంగా భవానికి పూజలు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు విజయలక్ష్మి, మెట్టిల బాలరాజు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రకాశరావు వాహన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. తాళ్లూరు ఎస్‌ఐ కె. విజనకుమార్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో చౌడేశ్వరి దేవి జయంతి

కురిచేడు: మండలంలోని ఎస్‌ఎస్పీ అగ్రహారంలో వేంచేసి ఉన్న శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన తొగట వీర క్షత్రియుల కుల దేవత చౌడేశ్వరిదేవి అమ్మవారికి ఆదివారం ఉదయం పాలాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు చేసి నివేదించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.



ఆలయం వద్దకు చేరుకున్న పోలేరమ్మ కుంకుమ బండి

మానసిక దివ్యాంగురాలి ఆవేదన



బాలికకు వైద్యులు మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్



తండ్రితో యక్కలి కవిత

- పింఛన్ ఇప్పించాలని తండ్రి వేడుకోలు

కంభం: మానసిక వికలాంగురాలైన తన బిడ్డకు పింఛను మంజూరు చేయాలని ఓ రిక్షా వాలా వాపోతున్నాడు. కంభం–3 సచివాలయం పరిధిలో నివాసం ఉంటున్న యక్కలి దానం రిక్షా తొక్కి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తనకు ఒక్కగానొక్క కుమార్తె మానసిక వికలాంగురాలైన యక్కలి కవితకు పింఛను కోసం వెళ్లగా.. సదరం సర్టిఫికెట్ అవసరమని సచివాలయ ఉద్యోగులు తెలిపారు. దీంతో ఒంగోలు జీజీహెచ్ ద్వారా సర్టిఫికెట్ తెచ్చుకుని అనంతరం పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో మంజూరుకు ఆటంకం ఎదురైంది. కానీ కొత్త ప్రభుత్వం వచ్చినా ఆ అభాగ్యురాలి గురించి పట్టించుకోవడంలేదు. రిక్షా తొక్కితే వచ్చే సంపాదన చాలక.. కుమార్తె మందులుకు డబ్బు సరిపోక ఆ తండ్రి ఆవేదన చెందుతున్నాడు. తమకు న్యాయం చేయాలని కోరుకుంటున్నాడు.

అధ్వానంగా వైద్యశాల రహదారి

దొనకొండ: స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే రహదారి చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. గుంతలమయం కావడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దొనకొండకు సుమారు అర కిలో మీటర్ దూరంలో వైద్యశాల నిర్మించారు. బస్టాండ్ సెంటర్ నుంచి రోగులు వైద్యశాలకు వెళ్ళడానికి చాలా ఇబ్బందికరంగా ఉంది. వర్షం పడితే గుంతలలో వారం రోజులు నీరు నిలిచి ఉంటోంది. ద్విచక్ర వాహనాలు వెళ్ళాలంటే రోడ్డు మొత్తం జారుతోంది. ఎన్నోసార్లు వాహనాలు జారి రోగులకు గాయాలైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ దారి ద్వారా బాదాపురం, గ్యాస్ కంపెనీకి కూడా వెళుతుంటారు. ముఖ్యంగా రాత్రివేళ అనుకోకుండా సంఘటన జరిగిన సమయంలో వైద్యశాలకు వెళ్ళాలంటే భయంగా ఉంది. రోడ్డు వెంబడి విష సర్పాలు కూడా తిరుగుతుంటాయి. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న వైద్యశాల రహదారి

ఘనంగా ఆదివారం అమావాస్య పూజలు



త్రిపురాంతకం ప్రత్యేక అలంకారంలో శ్రీబాలా త్రిపురసుందరీ దేవి



తిపురాంతకం చిన్న మస్తాదేవికి ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: ఆషాఢ మాసం ఆదివారం అమావాస్య సందర్భంగా శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు, చిన్న మస్తాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

త్రిపురాంతకం ఆలయాల్లో ఆషాఢ మాసం చివరి రోజున భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి పూజలు చండీ హోమం నిర్వహించారు. చిన్న మస్తాదేవికి నిమ్మకాయలు, గుమ్మడికాయలతో ప్రత్యేక పూజలు చేశారు.



త్రిపురాంతకం అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

యమ డేంజర్



కంభం బస్టాండు వైపు కూలీలతో వెళ్తున్న ఆటో



ఆటోలో ప్రమాదకరంగా కూర్చున్న మహిళలు



అనంతపురం- అమరావతి రహదారిపై ప్రమాదకరంగా వెళ్తున్న దృశ్యం

- ప్రైవేటు వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం
- ఏ నిమిషం ఏం జరుగుతుందో అనే ఆందోళన
- పట్టించుకోని అధికారులు

కంభం:

ప్రజలు తమ ప్రాణాలను సైతం లెక్క చేయక ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నారు. దీనివల్ల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నా ఖాతరు చేయడంలేదు. కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల మధ్య నిత్యం వందలాది ఆటోలు తిరుగుతుంటాయి. అయితే డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని భద్రత గాలికి వదిలేస్తున్నారు. పంటపొలాల్లో పనిచేసేందుకు ఆటోలతో పాటు బొలేరో ట్రక్కులు, ట్రాక్టర్లలో కూలీలు ఎక్కి వెళ్తున్నారు. బొలెరో ట్రక్కులో అయితే గాలి దూరే సందుకూడా లేడా లేకుండా 25–30 మంది వరకు ఎక్కుతుంటారు. అరటి, మిర్చి లోడుతో గుంటూరుకు ఇలా రాకపోకలు సాగిస్తున్నారు. మితిమీరిన వేగంతో వెళ్ళే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే తీవ్రంగా నష్టపోక తప్పదు. గతవారం బేస్తవారిపేటలో రెండు ప్రమాదాలు జరగ్గా ఇద్దరు చనిపోయారు. అర్ధవీడు లోయకు కొండ వెంబడి పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదరంగా వెళ్తుంటారు. పోలీసులు ట్రాఫిక్ పై దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

మేమేమి చేశాము పాపం!

- కంభంలో శునకాల బాధ నుంచి విముక్తి
- మరి పక్కనే ఉన్న కందులా పురం పరిస్థితి?
- అధికారుల తీరుపై స్థానికుల అసహనం

కంభం: కుక్కల బెడదగా ఎక్కువగా ఉండటంతో గత నాలుగైదు రోజుల నుంచి కంభం పంచాయతీలో సుమారు 500కు పైగా కుక్కలను పట్టుకొని అటవీ ప్రాంతానికి తరలించారు. అయితే మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురం రెండు కలసిపోయి ఉంటాయి. కంభం పంచాయతీ పరిధిలో కుక్కలను పట్టించే కార్యక్రమం పూర్తి చేశారు కానీ.. కందులాపురం గురించి పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు స్పందించి కందులాపురం పంచాయతీలో కుక్కలను పట్టించే కార్యక్రమం చేపట్టాలని కోరుతున్నారు.

ఇసుక డంప్‌ను తనిఖీ చేసిన సెబ్ సీఐ

కొమరోలు: మండల కేంద్రంలో అనధికారికంగా ఇసుక డంప్‌ను ఏర్పాటు చేయగా ఆ డంప్‌ను గిద్దలూరు సెబ్ సీఐ కొండారెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. సెబ్ సీఐ కొండారెడ్డి, వారి సిబ్బంది ఆదివారం మధ్యాహ్న సమయంలో కొమరోలు నుంచి యర్రపల్లె గ్రామానికి వెళ్ళే రహదారిలో డంప్ చేసిన ఇసుకను పరిశీలించి వాహనదారుల నంబర్లను మోదు చేయించారు. కాగా అధికారికంగా ఇసుకను డంప్ చేయడానికి అనమతులు లేవు. కానీ సంబంధిత అధికారులు కేసు నమోదు చేయకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు భావిస్తున్నారు.



ఇసుక డంప్ వద్ద వివరాలు సేకరిస్తున్న సెబ్ సిబ్బంది

ఆరుగురు జూదరుల అరెస్ట్

కొమరోలు: స్థానిక పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి 6గురిని అరెస్టు చేశారు. ఈసంఘటన మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పేకాట ఆడుతున్నట్లుగా సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్సై మధుసూదన్‌రావు పోలీసు సిబ్బందితో శిబిరంపై దాడి చేసి వారి వద్ద ఉన్న 5890 రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు ఎస్సీకాలనీ సమీపంలోని పంట పొలాల్లో పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. ఆరుగురి వద్ద నుంచి రూ.3,720 నగదు స్వాధీనం చేసుకున్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

గులాబీ రంగు పురుగుతో ప్రమాదం

అర్ధవీడు(బేస్తవారిపేట): పత్తి పంటలో గులాబీరంగు పురుగు పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి షేక్ మహమ్మద్ అన్నారు. ఆదివారం నాగులవరం, కాకర్ల గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించారు. పత్తి పంటను 30–90 రోజుల వ్యవధిలో గులాబీరంగు పురుగు ఆశిస్తుందని, దీనితో పత్తి పంటకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించి పంటను కాపాడుకోవచ్చునన్నారు. వేప నూనె, వేప కషాయం, టోపినోఫాస్ లేదా ఐమోడీకర్బ మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. ఏఈఓ శివగంగప్రసాద్, రైతులు పాల్గొన్నారు.